## 20న జాబ్‌మేళా

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 18: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఈ నెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు పది, ఇంటర్, డిగ్రీ చదివిన అభ్యర్థులు www.nic.gov.in పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకొని సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 9866465024, 7386809422 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## టీఎఫ్ఏ కోశాధికారి ఇమ్మానుయేల్ కన్నుమూత



హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ పుట్‌బాల్ అసోసియేషన్(టీఎఫ్ఏ) కోశాధికారి ఇమ్మానుయేల్ సెల్కోస్ శనివారం గుండెపోటుతో కన్నుమూశారు. తెలంగాణ పుట్‌బాల్ అభివృద్ధికి పాటుపడిన ఇమ్మానుయేల్ ఆకస్మిక మృతి పుట్‌బాల్ అభిమానులను కలిచివేసింది. ఇమ్మానుయేల్ మృతికి టీఎఫ్ఏతో పాటు పలువురు క్రీడాకారులు, అభిమానులు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆదివారం ఉదయం ఇమ్మానుయేల్ అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

## ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ నూతన కమిటీ



చైర్మన్ మంజీత్ బుచా

ఉప్పల్, జనవరి 18 : ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ ఆఫీస్ బేరర్ల(2025) నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశంలో కంపెనీ సెక్రటరీల వృత్తి పార్లమెంట్ చట్టం, కంపెనీ సెక్రటరీల చట్టం ప్రకారం ఏర్పాటు చేసిన వృత్తిపరమైన సంస్థ ఐసీఎస్ఐ అని అన్నారు. ఇది ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ పరిధిలో పని చేస్తున్నదన్నారు. కంపెనీ సెక్రటరీ కోర్సు చదువుతున్న విద్యార్థులకు అత్యుత్తమ విద్యనందించడంపై సంస్థ దృష్టిపెడుతుందన్నారు. ఇనిస్టిట్యూట్‌లో 74 వేల మంది సభ్యులు, 2 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ చాప్టర్ డైమండ్ గ్రేడ్ చాప్టర్‌లో ఒకటని, చాలా శక్తివంతమైన అధ్యాయమన్నారు. నూతన కమిటీ చైర్మన్‌గా మంజీత్ బుచా, వైస్ చైర్మన్‌గా శిల్పాబంగ్, సెక్రటరీగా పవన్ కంకిణి, కోశాధికారిగా కార్తిక్, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా నారాయణగుప్తా, లలితాదేవి, అక్షిత సురాన, ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా వెంకటరమణ, మహాదేవ్ తిరునగరి ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

# ఆలయ భూములు కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు

## హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరిక



జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ భూముల కబ్జాలపై స్థానికులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

- జగద్గిరిగుట్ట ఆలయం, పరికి చెరువు సందర్శన
- ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు
- నిర్లక్ష్యపు అధికారులపైనా ప్రభుత్వానికి నివేదిక

సిటీబ్యూరో/జగద్గిరిగుట్ట, జనవరి 18(నమస్తే తెలంగాణ): జగద్గిరిగుట్టలోని పరికి చెరువు పరిధిలోని అక్రమకట్టడాలను త్వరలోనే కూల్చేస్తామని, ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. కులసంఘాల పేరుతో ఆలయ భూములను కబ్జా చేసి ప్లాట్లు అమ్ముతున్నవారిపైనా చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్ట డివిజన్‌లోని సర్వే నెంబర్ 348/1లో శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట ఉన్న గోవిందరాజస్వామి ఆలయ కోనేరు భూమి కబ్జాకు గురవుతుందంటూ అర్చకుడు నరహరి ఏడుస్తూ చెప్పిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి, గోవిందరాజస్వామి ఆలయ పరిసరాలను పరిశీలించి కోనేరు కబ్జా వివరాలు తెలుసుకున్నారు. జగద్గిరిగుట్టలో కులసంఘాల పేరుతో వెలసిన ప్రహరీ నిర్మాణాలను పరిశీలించారు. జగద్గిరిగుట్ట ఆలయ సముదాయాల స్థలం 14.10ఎకరాల వరకు ఉంటుందని, పరికి చెరువు 66 ఎకరాలకు పైగా ఉంటుందని స్థానికులు హైడ్రా కమిషనర్‌కు వివరించారు. కోనేరు భూమి కబ్జాకు గురవుతుంటే ఏం చేస్తున్నారంటూ స్థానిక అధికారులపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఈ ఆలయభూమిలో కొందరు కబ్జా చేసి స్థిరనివాసాలు ఏర్పర్చుకోగా మరికొందరు కులసంఘాల పేరుతో పెద్దమొత్తంలో ల్యాండ్‌ను ఆధీనంలోకి తీసుకుని ప్రహారీలు నిర్మించారు.

అయితే జగద్గిరిగుట్ట కొండపై శ్రీ లక్ష్మీవేంకటేశ్వరాలయం ఎదురుగా ఉన్న గోవిందరాజస్వామి ఆలయ నీటికొలనును కొందరు కబ్జాలు చేసి రూములు కట్టి విక్రయిస్తున్నారని స్థానికులు రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో కబ్జాదారులు భూదేవిహిల్స్ పరిసరాల్లో అమ్మకాలు వేగవంతం చేశారు. భూదేవిహిల్స్ తోపాటు ఏకంగా దేవాదాయశాఖ ఆధీనంలోని స్థలాల అమ్మకాలు చేపట్టారు. దాంతో కమిషనర్ చెరువును ఆనుకుని ఉన్న భూదేవిహిల్స్, బాలకృష్ణనగర్ కాలనీలను సందర్శించారు. స్థానికంగా ఓ కార్పొరేటర్‌తో పాటు కొందరు నేతలు కబ్జాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటూ పోలీసులను ఆయన ఆదేశించారు. కులసంఘాల పేరుతో నిర్మించిన ప్రహారీనిర్మాణాలపై కూడా సమగ్రంగా దర్యాప్తు జరిపి కబ్జాలపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. త్వరలోనే సర్వే ఆఫ్ ఇండియాతో సర్వే చేయించి ప్రభుత్వ భూములను కాపాడతామని ఆయన తెలిపారు. 2024 జూలై తర్వాత వచ్చిన చట్టవిరుద్ధ నిర్మాణాలను గుర్తించి వాటిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయభూములను కబ్జా చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

### పరికి చెరువు పరిరక్షణకు కమిటీ, వాట్సాప్ గ్రూపులు

అలాగే గాజులరామారం పరికి చెరువు కబ్జాకు గురవుతుందంటూ వచ్చిన ఫిర్యాదులపై స్థానికులతో రంగనాథ్ మాట్లాడారు. పరికి చెరువు ప్రాంతంలో ఓ కార్పొరేటర్ సహాయంతో కబ్జాదారుడు చెరువు పూడ్చి అమ్మకాలు సాగిస్తున్నారని పలువురు పేర్కొన్నారు. చెరువులో పెద్ద ఎత్తున మట్టిపోసి చెరువును పూడ్చుతున్నారని.. ఆరునెలలక్రితం హైడ్రా అధికారులు ఆక్రమణ ప్రాంతాన్ని సర్వే చేసినట్లు తెలిపారు.

ఈనెల 22న హైడ్రా కార్యాలయంలో జగద్గిరిగుట్ట ఆలయ భూముల కబ్జా, పరికి చెరువులో ఆక్రమణలపై స్థానికులతో సమావేశం ఏర్పాటు చేశామని, సంబంధిత వ్యక్తులు, స్థానికులు అన్ని ఆధారాలు, సరైన పత్రాలతో రావాలని సూచించారు. సమావేశం తరవాత ఆలయభూములు, పరికి చెరువు కబ్జాలపై నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని రంగనాథ్ తెలిపారు. పట్టించుకోని అధికారులపైనా ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని చెప్పారు. పరికి చెరువు పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసి చెరువు కబ్జాకాకుండా కాపాడతామని చెప్పారు. వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి తనను అందులో యాడ్ చేసి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆయన సూచించారు. మరోవైపు హైడ్రా పోలీస్‌స్టేషన్ మరో పదిహేను రోజుల్లో పని ప్రారంభిస్తుందని రంగనాథ్ చెప్పారు. కబ్జాదారులపై నాన్‌బెయిలబుల్ కేసులు పెడతామని హెచ్చరించారు. కమిషనర్ వెంట హైడ్రా, రెవెన్యూ, ఇరిగేషన్, దేవాదాయశాఖల అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.



పరికి చెరువు వద్ద కబ్జా వివరాలు తెలుసుకుంటున్న రంగనాథ్

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా

# రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్



క్రీడాపోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, బీఆర్ఎస్వీ నాయకులు

సికింద్రాబాద్, జనవరి 18: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్వీ నాయకులు తెలిపారు. యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం క్రీడా పోటీల పోస్టర్‌ను తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ విడుదల చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్, రాష్ట్ర నాయకులు జిల్లా నాగయ్య, పవన్, మిథున్ ప్రసాద్, రామకృష్ణ, శ్రీకాంత్, సందీప్, సాయి, అనిల్, నవీన్, శివ, ప్రేమ్‌కుమార్, ఉదయ్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల కోసం సైకిల్‌యాత్ర



సైకిల్‌యాత్ర పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఓబీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు

రవీంద్రభారతి, జనవరి 18 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నామని ఓబీసీ జాయింట్ యాక్షన్ కమిటీ తెలిపింది. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ హిందూ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్, ఓబీసీ జాక్ చైర్మన్ డాక్టర్ అవ్వారు వేణుకుమార్, రఘురామ్, చారి సైకిల్ యాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సైకిల్‌యాత్ర ఈనెల 19న జనగామ జిల్లాలోని కిలాసాపూర్ నుంచి ప్రారంభమై వివిధ జిల్లాలో 14 రోజులపాటు 400 కిలో మీటర్లు కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైకిల్‌యాత్రకు స్పందించకపోతే 42 మంది బీసీ యోధులతో రాష్ట్రవ్యాప్తంగా ఆమరణ నిరాహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, దానిని నిలబెట్టుకోవాలన్నారు. ఇటీవల నిర్వహించిన కులగణన వివరాలను ప్రజలకు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు కొంగర నరహరి, మహేశ్‌గౌడ్, పర్వత సతీశ్, విజయ్‌కుమార్, అరుణ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్‌లో త్వరలో భూగర్భ విద్యుత్‌లైన్లు

## అధ్యయన సంస్థల ఎంపిక ప్రక్రియ షురూ

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో 15 వేల కిలోమీటర్ల మేర విద్యుత్ కేబుళ్లను భూగర్భంలోకి మార్చాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. అండర్‌గ్రౌండ్ కేబుల్ విధానంపై తొలుత అధ్యయనం చేయనున్నట్టు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ తెలిపారు. ఇతర దేశాలు, రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. సంస్థల ఎంపిక కోసం ఆశావహుల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించినట్టు తెలిపారు. కేబుళ్లను మార్చేందుకు ఎంతవ్యయం అవుతుందనేది రెండు, మూడు వారాల్లో తేలుతుందని చెప్పారు. ఆ తర్వాత దశల వారీగా 33కేవీ, 11కేవీ కేబుళ్లను అండర్‌గ్రౌండ్‌లోకి మార్చుతామని పేర్కొన్నారు.

### ఇప్పటికే 2200 కిలోమీటర్లు..

ఇప్పటికే గ్రేటర్‌లో దాదాపు 2200 కిలోమీటర్ల మేర భూగర్భ కేబుళ్లు ఉన్నాయి. వీటిలో 1,280 కిలోమీటర్ల మేర 33కేవీ కేబుళ్లు, మరో 957 కిలోమీటర్ల మేర 11కేవీ లైన్లను సైతం అండర్‌గ్రౌండ్‌లోకి మార్చారు. మొత్తంగా ప్రస్తుతం గ్రేటర్‌లో 33 కేవీ లైన్లు 3,725 కిలోమీటర్లు, 11కేవీ లైన్ 21,643 కిలోమీటర్ల మేర ఉన్నాయి. ప్రభుత్వం అనుమతిస్తే మరో 25వేల కిలోమీటర్ల లైన్లను సైతం భూగర్భంలోకి మార్చాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నట్టు సమాచారం.

కాగా ఈనెల 20న నోటిఫికేషన్ జారీ చేస్తామని, ఫిబ్రవరి 1వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, 7న సంస్థలు తమ ప్రెజెంటేషన్ ఇవ్వాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు www.tgsouthernpower.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని సీఎండీ సూచించారు.

## పదవీ విరమణ వయస్సు 58 ఏండ్లకు తగ్గించాలి

### ఓయూ జేఏసీ ప్రెసిడెంట్ మోతీలాల్‌నాయక్



ఆర్ట్స్ కళాశాల వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఓయూ జేఏసీ నాయకులు

సికింద్రాబాద్, జనవరి 18: ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 61 నుంచి 58 సంవత్సరాలకు తగ్గించాలని ఓయూ జేఏసీ ప్రెసిడెంట్ మోతీలాల్‌నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద జేఏసీ నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసును తగ్గించి పనిభారం లేకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా పోలీస్, ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 55 సంవత్సరాలకు తగ్గించాలని డిమాండ్ చేశారు. దాంతో ప్రతి యేటా 9,000 ఉద్యోగాలను అదనంగా భర్తీ చేయవచ్చునని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన నిర్ణయంతో రాష్ట్రంలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున మిగిలిపోయారని అన్నారు. వయోపరిమితిని పెంచడం వలన ఉద్యోగుల ఆరోగ్యం సహరించక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. లేనియెడల భవిష్యత్‌లో తెలంగాణ వ్యాప్తంగా నిరుద్యోగులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు అనిల్‌కుమార్, శివ, నాగరాజు, భార్గవ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పట్టాలిస్తే.. కాంగ్రెస్ కూల్చేస్తున్నది!

## పేదల ఇండ్లపైకి బుల్డోజర్ తెస్తే ఖబర్దార్..

### మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ .. కూల్చివేసిన ఇండ్ల పరిశీలన



కూల్చివేసిన పేదల ఇండ్లను పరిశీలించి మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్



రెవెన్యూ అధికారులు కూల్చివేసిన ఇల్లు

జవహర్‌నగర్, జనవరి 18: మాజీ సీఎం కేసీఆర్ పేదలకు ఇండ్ల పట్టాలు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఇండ్లను బుల్డోజర్‌తో కూల్చడమే పనిగా పెట్టుకుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ దుయ్యబట్టారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో దళిత, గిరిజన, పేద బీసీ వర్గాల ప్రజలు 60, 80 గజాల స్థలాల్లో రేకుల ఇండ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారని, వారి ఇండ్లను కూల్చివేయడం దుర్మార్గమని అన్నారు. శనివారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధి అరుంధతినగర్‌లో ఎంపీ ఈటల పర్యటిస్తూ పేదలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. పేదలు కష్టార్జితంతో కట్టుకున్న ఇంటికి కాంపౌండ్‌వాల్ నిర్మించుకోవాలన్నా, అదనంగా మరో రూమ్ కట్టాలన్నా రెవెన్యూ అధికారులకు పెద్ద మొత్తంలో అందజేస్తేనే గూడు నిలుస్తుందని, లేకుంటే ఫిర్యాదుల పేరుతో బుల్డోజర్‌తో కూల్చివేతకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై రాష్ట్ర రెవెన్యూ మంత్రికి ఫిర్యాదు చేస్తానని ఆయన హెచ్చరించారు. కుటుంబ నియంత్రణ కింద పేదలకు ఇండ్ల పట్టాలను అందజేసిన ప్రభుత్వం.. ఇందిరా ఆవాస్ యోజన పథకం ద్వారా ఇండ్లు నిర్మించుకుంటే.. అదే కాంగ్రెస్ ప్రభుత్వం పేదల గూడును కూల్చివేస్తున్నదని అన్నారు.

జవహర్‌నగర్‌లో పేదలు నిర్మించుకున్న ఇండ్ల జోలికి వస్తే... అరుంధతినగర్ నుంచే ప్రభుత్వంపై యుద్ధభేరి మోగిస్తానని శపథం చేశారు. పేదలు ఇండ్లు నిర్మించుకుని కరెంటు, ఇంటి నెంబర్లు తెచ్చుకుంటే హుడా అధికారులు 2500 ఎకరాల స్థలం తమ సంస్థది ఉందంటూ రావడమేమిమని ఆయన ప్రశ్నించారు. పేదల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం అధికారులు కూల్చివేసిన ఇండ్లను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మేడ్చల్ రూరల్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్‌యాదవ్, కార్పొరేటర్ పానుగంటి బాబు, రంగుల శంకర్, పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షుడు కమల్, సంతోష్, సందీప్, యాదగిరి, అరుంధతినగర్ వాసులు పాల్గొన్నారు.

## టీజీఓ హైదరాబాద్ జిల్లా డైరీ ఆవిష్కరణ

సిటీబ్యూరో, జనవరి 18(నమస్తే తెలంగాణ ) : టీజీఓ హైదరాబాద్ జిల్లా డైరీని శనివారం కలెక్టరేట్‌లో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీఓ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణాయాదవ్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఆశన్న, జనరల్ సెక్రటరీ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, వైస్ ప్రెసిడెంట్ మంజూలారెడ్డి, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## మార్కెట్ ధర ఇస్తేనే భూములిస్తాం..

### తిమ్మాపూర్‌లో ఫోర్త్‌సిటీ బాధిత రైతుల డిమాండ్

కందుకూరు, జనవరి 18 : ఫోర్త్ సిటీ రైతులకు ప్రభుత్వ ధర కాకుండా మార్కెట్ ధర చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ఫోర్త్ సిటీకి ఏర్పాటు చేస్తున్న రోడ్డులో భూములు కోల్పోతున్న బాధిత రైతులతో తిమ్మాపూర్ రెవెన్యూ అధికారులు శనివారం పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజు, తహసీల్దారు గోపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సభను నిర్వహించి రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. అనంతరం రైతులు తమ అభిప్రాయాలను రెవెన్యూ అధికారులకు విన్నవించారు. ప్రభుత్వ ధర ప్రకారం భూములు ఇచ్చేది లేదని, మార్కెట్‌లో తమ భూములను ఎకరాకు రూ. 4 కోట్లు పలుకుతుందని, ఆ రేటు ఇవ్వాలని రైతులు పట్టుబట్టారు. లేనియెడల భూములు ఇవ్వ లేమని తేల్చిచెప్పారు. పరిహారంతోపాటు 1000 గజాల ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. రైతుల డిమాండ్లు, సూచనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసువెళ్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగాపురం గోపాల్‌రెడ్డి, నర్సింహ, ఆర్ఐ యాదగిరి, సీపీఎం నాయకులు రాంచందర్, కుమార్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

# ఎలివేటెడ్ కారిడార్‌తో ఆలయాలకు ముప్పు

- ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించాలి
- భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యనగర్ ఉత్సవ్ సమితి ప్రతినిధులు

బొల్లారం,జనవరి 18: రాష్ట్ర ప్రభుత్వం ప్యారడేజ్ నుంచి శామీర్‌పేట వరకు చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్‌తో కంటోన్మెంట్ వ్యాప్తంగా సుమారు 25 దేవాలయాలు కూల్చివేతకు గురవుతున్నాయని, తద్వారా విలువైన చారిత్రక సంపదను కోల్పోతామని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. దేవాలయాల రక్షణకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గం ఎంచుకోవాలని కోరారు. శనివారం కంటోన్మెంట్ బోయిన్‌పల్లి చిన్నతోకట్ట సంజీవని ఆంజనేయస్వామి ఆలయంలో సమితి ప్రతినిధులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమితి ఎగ్జిక్యూటివ్ టీఎన్. మురారి మాట్లాడుతూ.. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో పురాతన దేవాలయాలను కూల్చివేయడం తగదన్నారు. హిందువుల మనోభావాలు గౌరవించి దేవాలయాలు కూల్చకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం ఆలయాల కమిటీ సభ్యులతో చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. తిరుమలగిరి మండలం చిన్న తోకట్ట న్యూ బోయిన్‌పల్లి సర్వే నంబర్ 75లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన 23 గుంటల భూమి విషయం హైకోర్టులో ఉన్నదన్నారు. ఈ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం చట్టవిరుద్ధమని, దీనిని తాము ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఈ విషయమై పునరాలోచన చేయాలని కోరారు. సమావేశంలో సమితి సభ్యులు మురారి,అనిల్ కుమార్, మన్నె శ్రీనివాస్, ముత్యాలమ్మ ఆలయ ప్రధాన పూజారి మహేశ్, రాజ్‌కుమార్, బాలకృష్ణ, నరేందర్ గౌడ్, నర్సింగ్, ఆలయ ఈఓ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మనిషి జీవితంలో.. అరుదైన జ్ఞాపకాలు

హిమాయత్‌నగర్: ప్రతి మనిషి జీవితంలో కొన్ని అరుదైన జ్ఞాపకాలు, అనుభవాలు ఉంటాయని పలువురు వక్తలు అన్నారు. ప్రొఫెసర్ కుంభం మధుసూదన్‌రెడ్డి రచించిన మరపురాని జ్ఞాపకాలు అనే పుస్తకావిష్కరణ శనివారం నారాయణగూడలోని భారత్ విద్యా సంస్థల ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, ఎమ్మెల్సీ కవి, గాయకుడు గోరెటి వెంకన్న , ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరై మాట్లాడారు. తెలంగాణ యాస, భాషా, సంస్కృతి, సంప్రదాయాల పట్ల సంపూర్ణమైన అవగాహన ఉన్న వ్యక్తుల్లో మధుసూదన్‌రెడ్డి ఒకరని తెలిపారు. పిల్లలను పెంచే తీరు తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగమేనని, మధుసూదన్‌రెడ్డి తన పిల్లలను అణిముత్యాలుగా పెంచారన్నారు. ఈ పుస్తకంలో నాటి పరిస్థితులను ఉన్నది ఉన్నట్లుగా మధుసూదన్‌రెడ్డి వివరించే ప్రయత్నం చేశారని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, రచయిత జూలూరు గౌరిశంకర్, భారత్ విద్యా సంస్థల చైర్మన్ సీహెచ్ వేణు గోపాల్‌రెడ్డి, ప్రతినిధులు నళిని, అరుంధతి, వసుంధరరెడ్డి పాల్గొన్నారు.



భారత్ విద్యాసంస్థల ఆడిటోరియంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుదర్శన్‌రెడ్డి

## నుమాయిష్



నాంపల్లిలోని నుమాయిష్‌లో ఏర్పాటు చేసిన జాతీయ గణాంకాల సంస్థ స్టాల్‌ను శనివారం హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ సందర్శించారు. గణాంక సంస్థ పనితీరును ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఎన్ఎస్ఓ రీజినల్ డీడీజీ అజిత్ కుమార్, డీడీ శివపార్వతి రెడ్డి, ఇతర ఎస్ఎస్ఓలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు